క్లుప్తంగా

నేడు పెనుమాకలో గురుపౌర్ణమి వేడుకలు

మంగళగిరి: పెనుమాక గ్రామంలోని శ్రీ షిర్డి సాయిబాబా ఆలయంలో ఆదివారం వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. భక్తులు విరివిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, స్వామి వారి ఆశీస్సులు పొందాలని పేర్కొంది.

లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో..

మంగళగిరి: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం గురు పౌర్ణమి మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి శనివారం తెలిపారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక గురుపౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని పేర్కొన్నారు.

ఎంటీఎంసీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో వర్షాల నేపథ్యంలో ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ ఆలీమ్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడకుండా సచివాలయం సిబ్బంది డోర్ టు డోర్ టు తడి చెత్త, పొడిచెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పారిశుద్ధ్యం, మురుగు నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు నిరంతరం అధికారులు అందుబాటులో ఉండేలా మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 70939 12653 ఏర్పాటు చేసి, శానిటేషన్, పర్యావరణ, హెల్త్ సెక్రటరీలను 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

తాడికొండ: శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. బండ్ల కోటేశ్వరరావు మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ వైద్య శిబిరంలో రావిచెట్టు సెంటర్‌లోని నార్త్ పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శుక్లాలు ఉన్న వారిని ఉచిత బస్సు సౌకర్యంతో శంకర కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి.. ఉచిత శస్త్ర చికిత్స నిర్వహించనున్నారని తెలిపారు. శిబిరానికి విచ్చేసే వారు ఆధార్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

డయేరియాపై అవగాహన

ఫిరంగిపురం: డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యురాలు శ్వేత హెచ్చరించారు. మండల కేంద్రంలోని సచివాలయం -2 పరిధిలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 189 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం ప్రజలకు డయేరియా గురించి అవగాహన కల్పించారు. విరోచనాలు అవుతున్నట్లయితే గ్రామంలోని హెల్త్ సెంటర్‌లో జింకు మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు తీసుకోవాలని చెప్పారు. భోజనానికి ముందు చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్పందన, ఏఎన్ఎం షేక్.మాబు, విజయకుమార్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి తాళాలు పగులగొట్టిన వారిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: కోర్టు ఆదేశాలు లేకుండా బ్యాంకు సిబ్బంది న్యాయవాదులను వెంటబెట్టుకుని వచ్చి ఇంటి బయట గేటు తాళం పగులగొట్టి అక్రమంగా ప్రవేశించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. తారకరామానగర్‌లోని హైమావతి నివాసాన్ని విజయకుమార్ కొనుగోలు చేశాడు. అయితే హైమావతి డబ్బులు తీసుకుని రిజిస్ట్రార్ చేయలేదు. విజయకుమార్ రిజిస్ట్రారు చేయాలంటూ కోర్టులో కేసు వేశాడు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. ఈనేపథ్యంలో శనివారం యూనియన్ బ్యాంకు సిబ్బంది, న్యాయవాదులను వెంట తీసుకుని ఇంటి గేటు తాళాలు పగులగొట్టి లోపలకు వప్రవేశించారు. సమాచారం తెలుసుకున్న విజయకుమార్ వారిని ప్రశ్నించగా, ఇల్లు బ్యాంకు తాకట్టులో ఉందని వారు తెలిపారు. అయితే వారి వద్ద కోర్టు ఆర్డర్లు లేవు. విజయకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక హత్య కేసులో నిందితుడిని గుర్తించాలి

నగరంపాలెం: దళిత బాలిక హత్యకు కారణమైన వ్యక్తి వెంటనే గుర్తించి, కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావుమాదిగ కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం(డీపీఓ)లో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. బాలిక హత్యకు గురై వారం రోజులు గడిచిన, నిందితుడి ఆచూకీ గుర్తించకపోవడం బాధాకరమని చెప్పారు. బాధిత కుటుంబానికి నష్ట పరిహారం, ఒకరికి ఉద్యోగం కల్పించేలా జిల్లా కలెక్టర్‌తో చర్చించాలని కోరారు. ఎంఎస్ఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షులు కూచిపూడి మోహన్‌మాదిగ మాట్లాడుతూ హత్య కేసును త్వరితగతిన ఛేదించాలని అన్నారు. తద్వారా బాధిత కుటుంబానికి న్యాయం చేయాల ని అన్నారు. జిల్లా ఎస్పీని కలసిన వారిలో టీడీపీ సీనియర్ నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ భూమే కదా కొందాం.. అమ్మేదాం!

- భూ దాహంతో అలమటిస్తున్న టీడీపీ నేతలు..
- కాజలో రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిపై కన్ను
- టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే దళారుల అవతారం
- సాగుదారుల నుంచి స్వాధీన పత్రాలపై క్రయ విక్రయాలు
- పూర్తి సహకారం అందిస్తున్న అధికారులు


కాజలోని ప్రభుత్వ భూమి

మంగళగిరి: తెలుగుదేశం పార్టీ నాయకుల కన్ను ప్రభుత్వ భూములపై పడింది. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన కాజ గ్రామం పుల్లయ్య నగర్‌లో ప్రభుత్వ భూమిని టీడీపీ నేతలు దళారులుగా అమ్మకాలు చేస్తుండడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కాజ పుల్లయ్య నగర్‌లోని 310 సర్వే నంబరులో 90 ఎకరాల చెరువు పోనూ.. ఆరు ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి అదనంగా ఉంది. స్థానిక రైతులు కొంత మంది ఆ భూమిని సాగుచేసుకుంటున్నారు. ప్రస్తుతం అక్కడ ఎకరం మార్కెట్ విలువ రూ.10 కోట్లుకు పైగా పలుకుతోంది. దీంతో ఆ భూమిపై టీడీపీ నేతల కన్నుపడింది. సాగు చేసుకుంటున్న రైతుల నుంచి సెంటు రూ.లక్షకు కొనుగోలు చేస్తూ..దళారులతో కలిసి రూ.2 నుంచి రూ.3 లక్షలకు పైగా విక్రయాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూమి కావడంతో ఎలాంటి రిజిస్ట్రేషన్లు లేకుండా స్వాధీన పత్రాలపైనే అమ్మకాలు చేస్తున్నారు. ప్రభుత్వ భూమి క్రయ విక్రయాలు జరక్కుండా చర్యలు తీసుకోవాల్సిన సచివాలయ అధికారి ఆక్రమణదారులతో లాలూచి పడి వారికి సహకరిస్తోందని స్థానిక ప్రజలు బహిరంగంగా చెబుతున్నారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ భూమి క్రయ విక్రయాలను అడ్డుకుని, రక్షించాలని ప్రజలు కోరుతున్నారు. భూమిని స్వాధీన పరచుకుని ప్రభుత్వం వినియోగించుకునేలా చూడాలని విన్నవిస్తున్నారు. ఈ విషయమై టౌన్ ప్లానింగ్ డీసీపీ అశోక్‌కుమార్ వివరణ కోరగా కార్పోరేషన్ పరిధిలో ప్రభుత్వ భూముల క్రయ విక్రయాలు చెల్లవని సమాధానం ఇచ్చారు. కాజ పుల్లయ్య నగర్‌లోని చెరువు భూమిలో క్రయ విక్రయాలు జరిగినట్లయితే.. విచారణ జరిపి భూమిని స్వాధీనం చేసుకుంటామని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివరణనిచ్చారు.

పెట్టుబడి సాయం వెంటనే అందజేయాలి

ఆర్బీకేల్లో ప్రజా, రైతు సంఘాల నాయకుల వినతి


ఉండవల్లి ఆర్బీకే వద్ద వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మంగళగిరి: ఎన్నికల సమయంలో రైతులకిచ్చిన హామీలను టీడీపీ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తాడేపల్లి మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో శనివారం రైతు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు వ్యవసాయాధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకుడు హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మోటార్లకు పెట్టిన విద్యుత్ మీటర్లు తొలగించేలా జీఓ నంబరు 22ను రద్దు చేయాలని కోరారు. భూ యజమానులకు సంబంధం లేకుండా కౌలు రైతు కార్డులు అందజేయాలని, రూ.2 లక్షల రుణాన్ని రద్దు చేసి, కేరళ తరహా రైతు రుణ విమోచన చట్టం తేవాలన్నారు. రైతు సంఘం నాయకులు కృష్ణ, పి.శివనాగేశ్వరరావు, బి.సంసోను, ఎస్.విజయరాజు, పి.సుబ్బారావు, ఎం.పాములు, జి.విజయరాజు, సాంబయ్య పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు

కోటేళ్ల వాగు పొంగడంతో రాజధాని రాకపోకలకు అంతరాయం


అధ్వానంగా పంట పొలాలకు వెళ్లే మార్గం

తాడికొండ: అల్పపీడన ద్రోణి ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో పాటు శివారు కాలనీల్లో డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా మారాయి. రోడ్లు అధ్వానంగా ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. పెదపరిమి కోటేళ్ల వాగు పొంగి పొర్లడంతో వర్షపు నీరు రోడ్డుపైకి చేరి వాహనదారులన 5 గంటలకు పైగా ఇబ్బందులు పడ్డారు. దీంతో రాజధాని ప్రాంతం హైకోర్టు, సచివాలయం ఇతర పనుల కోసం వెళ్లే ఉద్యోగులు, ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. విద్యా సంస్థలు, ప్రముఖ యూనివర్శిటీలకు వెళ్లే విద్యార్థులు ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకున్నారు. మరో మూడు రోజుల పాటు వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీంతో మురుగునీటి వ్యవస్థ ప్రక్షాళన చేసి, శివారు కాలనీల్లో నీటి నిల్వలు బయటకు పంపేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కాల్వలను మూసివేసి.. రియల్ ఎస్టేట్ వెంచర్లు



నీటి పారుదలకు అడ్డంకి

తాడికొండ: రాజధాని భూమ్‌తో ప్రస్తుతం ఇబ్బడి ముబ్బడిగా రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలిశాయి. సరైన నిబంధనలు పాటించకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధాన రహదారులు, డొంకల వెంబడి ఉన్న పొలాలను కొనుగోలు చేసి వెంచర్లు వేసేందుకు కాల్వలపై చిన్నపాటి తూములను వేసి పూడ్చి వేస్తున్నారు. అన్ని ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రతరం కావడంతో వెంచర్ల వెంబడి పంట పొలాలు సాగు చేసే రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత అధికారులు దీనిపై సరైన చర్యలు తీసుకోవడం లేదు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వెంచర్లు సముద్రాన్ని తలపిస్తున్నాయి. వర్షపు నీరు పక్కన పంటలు సాగు చేసే రైతుల గుండెల్లో కడగండ్లు మిగుల్చుతున్నాయి.


సంద్రంలా మారిన ప్లాట్లు

పరిశుభ్రమైన ఆహారంతో ఆరోగ్యం



ఫిరంగిపురం: పరిశుభ్రమైన ఆహారంతోనే ఆరోగ్యం చేకూరుతుందని నుదురుపాడు పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది సూచించారు. మండలంలోని మునగపాడు బీసీ ఏరియా-2 అంగన్‌వాడీ సెంటర్ పరిధిలోని తల్లులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. మురుగు పారుదల సక్రమంగా లేకుంటే దోమలు వృద్ధి చెందుతాయని, దాని ద్వారా మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వచ్చే ప్రబలే అవకాశం ఉందని హెచ్చరించారు. గాబులు, తొట్లల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.సుదర్శనరాజు, రాజశేఖర్, లింగారాజు, అరుణ, రమణ, అంగన్‌వాడీలు పి.ఆరోగ్య మేరి, షేక్.అల్లాబి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందు వెంకటగిరిరాజు, కె.నరసింహారావు విన్నవించారు. శనివారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈఓ పి.శైలజకు వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ఎక్కువగా ఉన్న చోట్ల విద్యాబోధనకు తగిన సంఖ్యలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరారు. గతంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలల సందర్శనలో భాగంగా సంజాయిషీ పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులపై తదుపరి చర్యలను రద్దు చేయాలని వినతిపత్రంలో కోరారు. నూతనంగా ఉద్యోగోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు ప్రొబేషన్ డిక్లరేషన్ చేయాలన్నారు. పాఠశాలల్లో కొత్తగా చేరిన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం సత్వరమే పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. డీఈఓను కలసిన వారిలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు, నాయకులు కె.గోపి ఉన్నారు.

ఫిరాయింపుల నిరోధక చట్టం ఉనికే ప్రశ్నార్థకం



మాట్లాడుతున్న న్యాయవాది వి.ఎస్.ప్రసాదరావు

లక్ష్మీపురం: ఫిరాయింపుల నిరోధక చట్టం(1985) ఉనికే ప్రశ్నార్థకంగా మారిందని న్యాయవాది ముప్పాళ్ల వీఎస్ ప్రసాదరావు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన చర్చ గోష్టిలో మాట్లాడారు. దేశంలో స్థిరపడిన బలపడిన రాజకీయ సంస్కృతికి శాసనాలతో, విలువలతో నిమిత్తం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. పత్రికల పదజాలంలో 'ఆపరేషన్ ఆకర్ష్'లు, జంప్ జిలానీ'లు రాజకీయాల్లో భాగమైపోయాయన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య, విద్యావేత్త ఎస్.రవిబాబు, పి.భావన్నారాయణ, మల్లేశ్వరరావు చర్చలో పాల్గొని ప్రసంగించారు.

నెల్సన్ మండేలాకు నివాళి..

ప్రపంచ పౌరులందరూ నెల్సన్ మండేలాను ఆదర్శంగా తీసుకొని మనం జీవిస్తున్న ప్రపంచాన్ని ప్రభావితం చేయటానికి, మార్చటానికి మనలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం నెల్సన్ మండేలా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ ఇంజినీర్ సదాశివం, శివ, ప్రకాష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఐదు గేదెలు మృతి


కురగల్లు పొలాల్లో మృతి చెందిన గేదెలు

కురగల్లు(మంగళగిరి): సీఆర్డీఏ ప్రాంతంలోని కురగల్లు గ్రామంలో విద్యుదాఘాతంతో శనివారం ఐదు గేదెలు మృతి చెందాయి. కురగల్లు గ్రామానికి చెందిన 10 గేదెలు పొల్లాల్లోకి మేతకు వెళ్లాయి. గ్రామ శివారులో విద్యుత్ తీగలు వేలాడుతుండడంతో గేదెలు విద్యుదాఘాతానికి గురయ్యాయి. ఈ ప్రమాదంలో ఐదు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. తోట సాంబశివరావు నాలుగు గేదెలు, కోలవెన్ను పానయ్య ఒక గేదెను కోల్పోవాల్సి వచ్చింది. రాజధాని కోసం రైతుల నుంచి సేకరించిన భూముల్లో జంగిల్ క్లియరెన్స్ లేక మొక్కలు పెరిగిపోయి.. విద్యుత్ వైర్లకు తగులుతున్నాయి. సీఆర్డీఏ భూముల్లో వేసిన విద్యుత్ స్తంభాల వైర్లు మరమ్మతులకు నోచుకోకపోవడం.. విద్యుదాఘాతానికి కారణమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు విద్యుత్ స్తంభాలు ఒరగడంతో విద్యుత్ తీగలు పొల్లాల్లో కిందకు వేలాడుతున్నాయి. నిర్మానుష్య ప్రాంతం కావడంతో విద్యుత్తు శాఖ అధికారులకు సమాచారం అందలేదని.. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ తెలిపారు. పశు వైద్యధాకారి ఇచ్చే నివేదలను బట్టి ఒక్కో గేదెకు రూ.లక్ష పరిహారం అందజేసేలా చర్యలు తీసుకుంటానమని డీఈఈ తెలిపారు.

నీట మునిగిన పంటలకు నష్ట పరిహారం చెల్లించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు


పొలంలో రైతుతో మాట్లాడుతున్న పాశం రామారావు

తెనాలి: వర్షాల కారణంగా నీట మునిగిన పంట పొలాలకు రైతు భరోసా కేంద్రాల ద్వారా నష్ట పరిహారాన్ని చెల్లించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత వారం రోజులుగా తెనాలి మండలంలో కురుస్తున్న వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను శనివారం ఆయన సందర్శించారు. తెనాలి తేలప్రోలు గ్రామం అత్తోట మార్గంలో నీట మునిగిన పొలాలను రైతులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వెద పద్ధతిలో నాటిన వరి విత్తనాలు వర్షం పాలైందని రైతులు తమ గోడును వివరించారు. అధిక వర్షాలు తమను తీవ్రంగా దెబ్బతీశాయని కౌలురైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు. నీట మునిగిన పొలాల్లోకి పాశం రామారావు బృందం నేరుగా వెళ్లి వర్షపు నీటిలో తేలుతున్న వరి మొలకలను ప్రత్యక్షంగా చూశారు. అనంతరం రామారావు మాట్లాడుతూ అధిక వర్షాలు పంటలు సాగుచేస్తున్న కౌలు రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చిందని అన్నారు. ఎకరా వరిసాగుకు రూ.8 వేలు పెట్టుబడి పెట్టిన రైతు, కౌలు రైతులకు రూ.10 వేల నష్ట పరిహారం వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. నష్టపరిహారంతో పాటు ఆర్బీకే కేంద్రాల ద్వారా ఉచితంగా ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేయాలన్నారు. కౌలు రైతులకు పంటలపై రుణ సదుపాయం కల్పించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది కౌలు రైతులు డబ్బు కౌలు, ధాన్యం కౌలు చేస్తున్నారని యజమాని సంతకం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పంటకాల్వల్లో పేరుకుపోయిన తూటాకు, గుర్రపుడెక్క తొలగించని కారణంగానే ఖరీఫ్ ఆరంభంలోనే రైతులు నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందని ఆరోపించారు. సీపీఎం పార్టీ తెనాలి ఏరియా కమిటీ కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ మాట్లాడుతూ నీటి పారుదల, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పంట నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. పార్టీ సీనియర్ నాయకులు షేక్ హుస్సేన్ వలి, హయ్యర్ పేట యువ రైతు వంపుగళ్ల సుమంత్, అత్తోట రైతు ఎలివెల కొండలు పంట నష్టాన్ని వివరించారు.

వ్యక్తిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఓ విలేకరిని వృత్తిపరంగా విమర్శిస్తూ వార్త పెట్టిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..విలేకరి అరుణ్‌పై ఓ వ్యక్తి వృత్తిపరంగా విమర్శిస్తూ జర్నలిస్టు డైరీలో వార్త ప్రచురితమైనట్లు పోస్టు పెట్టాడు. అరుణ్ జర్నలిస్టు డైరీ పత్రిక నిర్వాహకులను సంప్రదించాడు. పత్రిక నిర్వాహకులు తమ పత్రికలో అటువంటి కథనం ఏదీ ప్రచురితం కాలేదని సమాధానం ఇచ్చారు. దీనిపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

- విద్యుత్‌శాఖ డీఈఈ చిరంజీవి
- వినియోగదారుల సమావేశంలో విద్యుత్ సమస్యలపై వినతుల స్వీకరణ


సమావేశంలో వినియోగదారులతో మాట్లాడుతున్న డీఈఈ చిరంజీవి

తెనాలిరూరల్: వినియోగదారుల విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ తెనాలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ చిరంజీవి తెలిపారు. స్థానిక చెంచుపేటలోని డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో శనివారం సాయంత్రం విద్యుత్ వినియోగదారుల సమావేశం నిర్వహించారు. డీఈఈ చిరంజీవి పాల్గొని విద్యుత్ వినియోగదారులు సూచించిన పలు సమస్యలను నమోదు చేసుకున్నారు. వినియోగదారుల తరపున పలువురు ప్రజా సంఘాల నాయకులు, విద్యుత్ వినియోగదారులు పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. రేపల్లె మండలంలో విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని పలువురు ఆయన దృష్టికి తెచ్చారు. జగ్గడిగుంటపాలెంలో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయని కెవి సత్యనారాయణ అధికారులకు చెప్పారు. విద్యుత్ బిల్లుల డిమాండ్ నోటీస్‌లో ట్రూ అప్ చార్జెస్, ఇంధన సర్‌చార్జీలను వేయొద్దని, 2019-2020నాటి విద్యుత్ టారిఫ్‌ను అమలు చేయాలని, డిస్కంల రుణాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. మరో వినియోగదారుడు ప్రసాద్ 11 పాయింట్లతో కూడిన సమస్యలను డీఈఈకి అందించారు. బ్రేక్ డౌన్ సమస్యలు, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, అమరావతి కాలనీ, ఆలపాటి నగర్ తదితర ప్రాంతాల్లో ఓల్టేజీ సమస్యలు వంటి వాటిని ఫిర్యాదులో పొందుపరిచారు. వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని ఈఈ చిరంజీవి తెలిపారు. అత్యవసరంగా పాత ప్రభుత్వ ఆస్పత్రి వద్ద విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించాల్సి ఉందని అన్నారు. కొత్తపేట, అమరావతి కాలనీలలో కూడా విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలు చేయాల్సి ఉందని చెప్పారు. వినియోగదారులు సూచించిన సమస్యలు పరిశీలించి వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని ఈఈ చిరంజీవి తెలిపారు. విద్యుత్ బిల్లులు చెల్లించే సమయంలో ఆర్బీఐ మార్గదర్శకాలు అనుసరించి ఫోన్ పే, గూగుల్ పే, పేటియం, ఇతర యాప్స్‌లో ఏపీసీపీడీసీఎల్ డిస్కం పేరు ఇకపై కనిపించదని, ఏపీసీపీడీసీఎల్ కంజ్యూమర్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకుని బిల్లులు చెల్లించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఈ బి. అశోక్‌కుమార్, డి-1 ఏఈ దుర్గారావు, డి-2 ఏఈ ఎం. లక్ష్మీనారాయణ, చేబ్రోలు ఏఈ పీవీ సుధీర్, తెనాలి రూరల్ ఏఈ సీహెచ్ వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

తెనాలిరూరల్: ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని విద్యుత్ శాఖ తెనాలి ఏడీఈ బి.అశోక్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. వర్షాలలో తడిచిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు తాకి ఉన్న చెట్లను తాకకూడదన్నారు. తేమ ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లోని విద్యుత్ మోటార్లు, ఇతర పరికరాలు స్విచ్‌లను వేసేప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. తడి వస్త్రాలు ఆరవేసే తీగలు విద్యుత్ తీగలకు దగ్గరగా ఉండకుండా చూడాలని సూచించారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్న సమయంలో ఇళ్లలోని విద్యుత్ పరికరాలను స్విచ్ఛాఫ్ చేయాలని సూచించారు. విద్యుత్ సమస్యలు ఎదురైతే ఐతానగర్ ప్రాంతంలోని వారు 9490615523, రామలింగేశ్వరపేట ఏరియాలోని వారు 8331014931, చెంచుపేట ఏరియాలోని వారు 9490615520, కొలకలూరు పరిధిలోని గ్రామాల వారు 9491043493, అంగలకుదురు పరిధిలోని గ్రామాల వారు 9490615524 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మోసం చేసిన వారిపై కేసు

గుంటూరు ఈస్ట్: ప్రభుత్వ సబ్సిడీతో కారు ఇప్పిస్తామని ఇద్దరు వ్యక్తులు ఓ వ్యక్తిని మోసం చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కేవీపీ కాలనీకి చెందిన దారపనేని శ్రీహరికి అరుంధతీనగర్‌కు చెందిన కొండవీటి రవీంద్రబాబు, కోయరపాలేనికి చెందిన నాగరాజులతో పరిచయం ఉంది. ఇద్దరు ప్రభుత్వ పథకం కింద 45 శాతం సబ్సిడీతో కారు ఇప్పిస్తామని శ్రీహరిని నమ్మబలికారు. శ్రీహరి అందుకు ఇరువురికి రూ.1.50 లక్షలు చెల్లించాడు. అనంతరం వారు కారు ఇప్పించలేదు. శ్రీహరి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ డీలర్ల కార్యవర్గం త్వరలో ఎన్నిక

గుంటూరు వెస్ట్: రేషన్ డీలర్ల సంఘం నగర శాఖను రద్దు చేసినట్లు జిల్లా అధ్యక్షుడు వైఏ ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర అధ్యక్షుడు తుమ్మల గాంధీ, ప్రధాన కార్యదర్శి షేక్ జిలాని, కోశాధికారి పీటీఎల్ వరప్రసాద్‌తో పాటు మరొకొందరు కమిటీ సభ్యులు సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడడంతో వారిని తొలగించామన్నారు.